తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## సాయంత్రం సందేవేళ సూరీడు...



ఉదయం నుంచి సాయంత్రం వరకు మండిపోతున్న ఎండలకు సతమతం అవుతున్నాడు. దీంతో ఉదయాన్నే భానుడు భగభగ మంటూ ఉన్నాడు. అయితే సూర్యోదయం ముందు, తర్వాత సూరీడు అస్తమించే ముందు ఎంతో అందాలు అద్భుతంగా ఉంటాయి. ముఖ్యంగా ఈచిత్రం పచ్చని పంటపొలాల్లోనుంచి చూస్తే ఎంతో అద్భుతంగా ఉంటుంది. శ్రీకాళహస్తి-నాయుడుపేట హైవైపై సాయం సందేవేళ సూరీడు అస్తమించే దృశ్యం ఎంతో ఆకట్టుకుంది.

-తొట్టంబేడు, ప్రభాతవార్త

## ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంకు కృషి

### జిల్లా విద్యాశాఖ అధికారిగా వరలక్ష్మీ బాధ్యతలు స్వీకరణ



డిఇఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న వరలక్ష్మీ

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని డిఇఓ ఛాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారిగా వరలక్ష్మీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు సమీపిస్తుండటంతో ఈ విద్యాసంవత్సరం జిల్లాను టెన్త్ పరీక్షా ఫలితాల్లో మెరుగైన స్థానంలో నిలిపేవిధంగా కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తామన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో చర్చించి ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తానన్నారు.

### ఉచిత గ్యాస్ సిలిండర్ల

## సరఫరాకు కసరత్తు

### జిల్లాలో 6.లక్షలమందికి లబ్ధి
### డిఎస్ఓ శేషచలరాజు వెల్లడి



కోట,అక్టోబర్ 27 ప్రభాతవార్త

జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి పౌరసఫరాల శాఖ అధికారులు కసరత్తు ప్రారంభిం చారు. కూటమి ప్రభుత్వం తెల్లరేషన్ కార్డున్న ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్ల చొప్పున ఉచితంగా ఇచ్చే పథకాన్ని దీపావళి పర్వదినం నుంచి ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో పేద కుటుంబాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ నెల 29 నుంచి గ్యాస్ బుకింగ్‌లు ఆరంబమవ్వుతా వుతాయి. ఈ నేపథ్యంలో విధివిధానాలపై ప్రభాతవార్త జిల్లా పౌరసఫరాల శాఖ అధికారి శేషచలరాజుతో మాట్లాడారు.ఐఓసీ, హెచ్‌పీసీఎల్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 6,00307 లక్షాల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు.తెలుపు రేషన్ కార్డులను ప్రాతిపదికగా తీసుకోవడం జరిగిందన్నారు. ఒక్కో సిలిండర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ 851ల వరకు రాయితీగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇలా ఏడాదికి దాదాపు రూ 2,553 వరకు అందించానున్నారుని ఆయన పేర్కొన్నారు.తెలుపు రేసను కార్డు,ఆధార్ కార్డు ప్రాతపదికగా తీసుకొని వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వారికి రాయితీ సొమ్మును బ్యాంకు కాతాలకు జమ చేయడం జరుగుతుందని చెప్పారు.ప్రస్తుతం వంట గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ చేస్తునప్పుటికీ ఆధార్,ఫోన్ నెంబరు ఆధారంగా బుకింగ్ అవుతోందన్నారు. రాయితీ పొందాలంటే రేషన్ కార్డు వివరాలను పొంపదర్చాల్సి ఉంటుందన్నారు. తొలి విడత రాయితీ నిధులు పొందడానికి గడువు ఉన్నందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

### తిరుపతిలో హోటళ్ళుకు

## బాంబు బెదిరింపులెందుకో!?

### -పూర్తినిఘాలోనే పర్యవేక్షణ ఉన్నాయా??
### -ఆగని ఈ మెయిల్స్‌తో అనుమానాలు!!

ప్రభాతవార్త-తిరుపతి:

యాత్రాస్థలంగా ఖ్యాతిచెందిన తిరుపతిలో ఓ సాధారణ హోటళ్ళ నుండి పెద్దహోటళ్ళు,స్టార్ హోటళ్ళలో యాత్రికుల భద్రతకు సురక్షితమేనా?అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందెన్నడూ లేనివిధంగా తిరుపతిలో పలు స్టార్ హోటళ్ళకు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వస్తుండటంతో నగరవాసులేగాక యాత్రికులు భయాందోళన చెందే పరిస్థితులు కలుగుతున్నాయి. ఇక్కడకు నిత్యం వస్తున్న వేలాదిమంది యాత్రికుల్లో ఎవరు దొంగలు,ఎవరు నేరస్తులు, ఎవరు మంచివాళ్ళు అనేది గుర్తించడం పోలీసుశాఖకు కూడా కష్టమే.అలాంటిది పూర్తిగా నిఘానేత్రాల పర్యవేక్షణతోనే తిరుపతి భద్రత కూడుకుంది. ఇప్పుడు వరుసగా స్టార్‌హోటళ్ళకు బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ వస్తుండటంపై పోలీసుశాఖ అప్రమత్తమైనా, హోటళ్ళ యాజమాన్యం పెద్దగా స్పందిస్తున్న దాఖలాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ వస్తున్నాయని చెబుతున్నా అసలు కొన్ని స్టార్ హోటళ్ళకే ఈ మెయిల్స్ రావడం కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిరుపతి యాత్రాస్థలంగానేగాక ప్రసిద్ధ ఆధ్యాత్మికనగరం,స్మార్ట్‌సిటీగా ఖ్యాతిచెందింది. ఇక్కడకు దేశ విధేశాల నుండి ప్రతిరోజూ 80వేలమంది వరకు యాత్రికులు తిరుమలకు, పలు రకాల వ్యాపారాల కోసం విమానాల్లో, రోడ్డుమార్గాల్లో, రైళ్ళలో చేరుకుంటుంటారు. ఇలా వచ్చిన యాత్రికులు తమతమ టూర్‌షెడ్యూల్‌లో బిజీగా ఉంటారు. తిరుపతినగరంలో పర్యాటకశాఖ అతిధిగృహాలు, హోటళ్ళతోబాటు టిటిడి వసతిసముదాయాలు, విశ్రాంతి గృహాలు, స్టార్‌హోటళ్ళు, ప్రైవేటు హోటళ్ళు దాదాపు పదివేలకుపైగా ఉంటాయి. అధికశాతంమంది యాత్రికులు ప్రైవేటు హోటళ్ళు, స్టార్ హోటళ్లలో గదులు తీసుకుని ఒకటిరెండురోజులుతో బాటు ఏకంగా వారం రోజులు కూడా తమ వ్యాపారలావాదేవీలపై బసచేస్తుంటారు. ఇలా వచ్చిన ప్రతి యాత్రికుడి నుండి వారివారి ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ హోటళ్ల నిర్వాహకులు తీసుకుని గదులును అద్దెకు ఇస్తారు. ముఖ్యంగా దేశంలోని పలు రాష్ట్రాల నుండి తిరుమల యాత్రలో భాగంగా తిరుపతిలో బసచేస్తుంటారు.అయితే ఇప్పుడు అందరిపై నిఘా ఉంచడం



కూడా కొంత క్లిష్టమే. ఈ నేపథ్యంలో హోటళ్ళ యాజమాన్యం కూడా హోటళ్ళ ప్రవేశ ద్వారాల వద్ద మెటల్‌డిటెక్టర్లు ,డోర్‌ఫ్రేమ్ డిటెక్టర్లు అత్యవసరంగా ఏర్పాటుచేసుకోవాల్సిన అవసరం వచ్చింది. పోలీసు అధికారులు కూడా ఆ దిశగా ఆదేశాలు జారీచేయాలి. తిరుపతినగరంలో ఒక్కసారిగా ఈ మెయిల్స్‌ద్వారా బాంబుల బెదిరింపులు రావడం పోలీసులకు చెమటలు పట్టిస్తోంది. తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడ చిన్న సంఘటన జరిగినా ప్రపంచవ్యాప్తంగా సంచలనమే. మరీ ఇలాంటి సమయంలో తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం హోటళ్ళ,స్టార్ హోటళ్ళ యాజమాన్యం వ్యాపారధోరణితోనేగాక యాత్రికుల భద్రతకు కూడా ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాల్సి వస్తోంది. తిరుపతిజిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు .అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, తిరుపతి డిఎస్పీ జొన్నలగడ్డ వెంకటనారాయణ, సిఐలు ,ఎస్ఐలు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నా ప్రముఖుల పర్యటన సమయంలో నిఘా కొంత బలోపేతం చేసుకోవాలని హోటళ్ళకు ఆదేశించాలి. అప్పుడే తిరుపతిలో హోటళ్ళవద్ద సెక్యూరిటీని పటిష్టంచేయడం, తనిఖీలు చేయడంలో అధునాతన సాంకేతిక పరికరాలు అమర్చుకోవడం వెంటనే చేపట్టేలా ఆదేశాలివ్వాలి.

## ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా..?

### కాలం చెల్లిన తినుబండారాలతో పాకాల ప్రజలు బెంబేలు..



పాకాల, అక్టోబర్ 27, ప్రభాతవార్త

పాకాల స్థానిక రైల్వే స్టేషన్ ముందు వున్న బస్సు షెల్టర్ పక్కన ఎక్స్పైరీ డేట్ అయిపోయిన ప్యాకెట్స్ చిన్న పిల్లలు తినే తినుబండారాలను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుని వచ్చి గుట్టలు గుట్టలుగా పడేసినట్లు ఆదివారం స్థానికులు గుర్తించారు. ఈ దుస్థితి పాకాలలోనే పరిమితమా దాదాపు సంవత్సరం గడిచిన ఇంకా వాటిని చిన్న పిల్లలకు చదువులేని వారికి ఇంకా కిరాణా షాపులు వారు విక్రయిస్తున్నారన్నారు. పాకాల హైస్కూల్ నందు రెండు రోజులుగా జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు చేయడం తెలిసిన కొంతమంది షాపు యజమానులు గుట్టు చెప్పుడు కాకుండా కాలం చెల్లిన తినుబండారాలను షాపు నుంచి తీసుకొని వచ్చి బయట పడేసినట్లుగా ఆదివారం తెలిసింది. ఒకటి రెండు షాపుల్లోనే ఒక ఆటో మొత్తం అవుట్ డేట్ సరుకు ఉంటే పాకాల పట్టణం మొత్తం, చుట్టుపక్కల ఉన్న షాపుల్లో ఉన్న షాపుల్లో ఎంత మొత్తంలో ఇలాంటి ఆహార పదార్థాలు ఉన్నాయో మరి, ఇవి తిన్న పిల్లల పరిస్థితి ఏంటి అంటున్న స్థానికులు ఇంకను కానరాని ఆ తనిఖీ అధికారుల జాడ ఇకనైనా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు మూకుమ్మడిగా పట్టణంలోని షాపులలో తనిఖీ చేసి నిల్వ చేసిన ఆహారపదార్థాలను గుర్తించి ఎక్కడా రాజీ పడకుండా ఒత్తిళ్లకు లొంగకుండా కిరాణా షాపులను బేకరీలను, బిర్యానీ సెంటర్లను, చికెన్ పకోడా షాపులు, పానీపూరి బండ్లు, స్కూల్ దగ్గరగా అలాగే ఆవరణలో ఉన్న క్యాంటీన్లో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలను విక్రయించే ఏజెన్సీలను గుర్తించి వారి లైసెన్స్ రద్దు చేసి సీజ్ చేసి ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

### టీడీపీ తీర్థం పుచ్చుకున్న

## ఐరాల జడ్పీటీసీ సుచిత్ర

ఐరాల, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



మండల వైకాపాకు చెందిన జడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర కన్నయ్యనాయుడు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సమక్షంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైకాపా తరపున జడ్పీటీసీగా గెలుపొందిన సుచిత్ర కన్నయ్యనాయుడు వైఎస్సార్ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని కలికిరిపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే మురళీ మోహన్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరి లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఆమెకు ఎమ్మెల్యే టీడీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అబివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, జిల్లా పార్టీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, మాజీ జడ్పీటీసీ లతలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కల్యాణ వెంకన్న ఆలయంలో

## 'పవిత్ర ప్రతిష్ఠ'

### తిరుచ్చిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం పవిత్ర ప్రతిష్ట ఆమోగక్తంగా నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలను ఆగమోక్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పార్థసారధి, బాలాజీ రంగకుమార్, నారాయణం శేషాచార్యులు, కేనమాకుల పల్లి నారాయణాచార్యులు, ఋత్విక్కులు, యాగశాల పరిచారిక వారిచేతుల మీదుగా ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను యాగశాలకు వేంచేపు గావించారు. వైదిక కార్యక్రమాలలో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయానం నిర్వహించారు. తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె,కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌కుమార్, ముని బాలకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తజన సంద్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 27 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. ఆదివారం కొండ దినం, వచ్చే నెల 2నుంచి కార్తీకమాసం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల వారు తరలిరావడంతో యాత్రీకుల రద్దీ అధికమైంది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

**గాలివీడు భక్తులపై దాడి :** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం వడిసలవంకపల్లికి చెందిన భారత సైనికుడు సురేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జానీలు పెద్దభోగం టెండరుదారులకు మధ్య ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకొన్న ఇఓ ఉపకమీషనర్ ఏకాంబరం సంఘనా స్థలానికి చేరుకొని ఇరువురికి సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. టెండరును రద్దుపరచి చర్యలు తీసుకొంటామని ఆయన పేర్కొన్నారు.

## ప్రాధాన్యత కొరవడిన రేణిగుంట !




### నియోజకవర్గం నుంచి విడిపోతుందంటూ వదంతులు
### నేతలు మండలంపై దృష్టి సారించడంలేదంటున్న ప్రజలు

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:

నియోజకవర్గాల పునర్విభజీకరణలో రేణిగుంట మండలం శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి విడిపోతుందన్న వదంతుల వల్ల నేతలు పట్టించుకోవడం లేదని చాలా మంది అంటున్న మాట. చరిత్రకు నిలువెత్తు నిదర్శనంగా వెలుగొందిన రేణిగుంట అన్ని రకాలుగా వెనుకబడిపోయింది. రేణిగుంట రైల్వే జంక్షన్ ఎంతో ప్రఖ్యాత చెంది అనేక ప్రాంతాలకు వెళ్లే వారు రేణిగుంట చేరుకుని తమ ప్రయాణాలను కొనసాగించేవారు అప్పట్లో. రేణిగుంట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ(సీఆర్ఎస్) ఒక వెలుగు వెలిగింది. ప్రస్తుతం కోచ్ ఫ్యాక్టరీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. రేణిగుంట మండలం జీవాగ్రంలోని పీఎం హైస్కూలు రాష్ట్రపతి, ముఖ్యమంత్రులకు చదువు చెప్పిన చదువులమ్మ బడి, ప్రస్తుతం ఎందుకు పనికిరాని దీనావస్థకు చేరుకుంది. పేరుకే రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెతలు రుజువు చేస్తూ ఎయిర్‌పోర్టు రన్‌వేలో కొంత భాగం టెర్మినల్ బిల్డింగ్ మినహా ఎయిర్‌పోర్టు పూర్తిగా ఏర్పేడు మండలంలో ఉండడమ, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా తిరుపతి విమానాశ్రయంగా సంబోదిస్తారు. విమానాశ్రయం ముందు ప్రత్యక్షంగా కనిపించే బోర్డుపై కూడా తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం అని రాసి ఉంటుంది. అల నాడు సీబీఐడీ కాలనీ ఆనుకుని ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి వెలుగులు విరజిమ్మింది. ఇప్పుడు అది శిథిలావస్థకు చేరుకుని కోట్లాది రూపాయల విలువచేసే భూమి అందులోని భవనాల్లో ముళ్ళ కంపలు పెరిగిపోయి ఎందుకు పనికి రాకుండా అ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సాక్షాత్కారిస్తుంది. భూ కబ్జాదారుల డేగ కళ్లు ఆ స్థలం పై పడ్డాయి. అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఒక భక్తురాలు శ్రీవారి హుండీలో డాక్యుమెంట్లు వేసి స్వామికి సమర్పించిన స్థలంలో తిరుమల తిరుపతి దేవస్థానం సమాచార కేంద్రం నిర్మించింది. అందులో నాలుగు గదులు, ఒక డార్మెటరీ ఉన్నాయి. గతంలో ఇక్కడ 50 రూపాయల తిరుమల శ్రీవారి దర్శనాల టోకెన్లు కట్టేవారు. వారానికి రెండు సార్లు హరికథ కాలాక్షేపాలు జరిగేవి. అంతేకాకుండా ఉదయం, సాయంత్రం సంధ్యా వేళలో శ్రీవారి భక్తి గీతాల మైక్ సెట్‌ల ద్వారా వీనుల విందు చేసేవి. కాలక్రమేనా ఈ విధానాలకు పూర్తిగా స్వస్తి పలికేశారు. ప్రస్తుతం అందులో టీటీడీ సిబ్బంది విధులునిర్వహిస్తున్నారు. రేణిగుంట రైల్వే జంక్షన్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది శ్రీవారు భక్తులు వివిధ రైళ్ళలో వస్తుంటారు. వారి కోసం ఆర్టీసీ సంస్థ రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి నేరుగా తిరుమలకు బస్సులు నడుపుతున్నారు. తిరుపతిలో శ్రీవారి ఉచిత దర్శన టోకెన్లు వేల సంఖ్యలో వివిధ ప్రాంతాల్లో కౌంటర్ల ద్వారా ఇస్తున్నారు. శ్రీవారి ముఖ ద్వారంగా చెప్పబడే రేణిగుంటశ్రీవారి సేవకునోచుకోలేదా..? సమాచార కేంద్రంలో సిబ్బందిని ఖాళీగా ఉంచి జీతాలు ఇచ్చే టీటీడీ యంత్రాంగం శ్రీవారి భక్తులకు ఉచిత దర్శన టోకెన్లు, 300 రూపాయల దర్శన టోకెన్లు ఇస్తే సౌకర్యంగా ఉంటుందని శ్రీవారు భక్తులు అంటున్నారు. రేణిగుంట మండల జనాభా విపరీతంగా పెరిగిపోయినప్పటికి వైద్య సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 30 పడకల ఆస్పత్రి కాదు కాదు వంద పడకల ఆస్పత్రి అని కాన్పులు జరపడానికి 24గంటలు మహిళా డాక్టర్లు అందుబాటులో ఉండేలా ప్రస్తుత ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని గతంలో ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలు అయ్యాయి. ఇకపోతే గత కొద్ది రోజులుగా రేణిగుంట మండలం నియోజకవర్గాల విభజనలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి వేరైపోతుందన్న వదంతులు అధికంగా వినిపిస్తున్నాయి. దీంతో అధికార పక్ష, ప్రతిపక్షంలోని ముఖ్య నేతలు రేణిగుంట మండలంపై దృష్టి సారించడం లేదని అంటున్నారు.

## చంద్రబాబు కుట్రలో షర్మిల భాగస్వామ్యం

### షర్మిల లాంటి చెల్లి ఉండటం జగన్ దురదృష్టకరం
### జగన్ లాంటి నాయకుడు రాజకీయాల్లో అరుదు
### మాజీ టిటిడి చైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



చంద్రబాబు కుట్రలో వైయస్.షర్మిల భాగస్వామ్యమైనారని, కూటమి నేతలతో కలిసి వైయస్.జగన్మోహన్‌రెడ్డి పై అవాంచిత ప్రకటనలను షర్మిళ చేసారని ఆరోపించారు. ఇలాంటి చెల్లెలు ఎవరికి ఉండరాదన్నారు. జగన్మోహన్‌రెడ్డి లాంటి ప్రతిభ నాయకుడు దగ్గర విశ్వాసంగా ఉండటం వరంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం పద్మావతిపురంలో టిటిడి మాజీ చైర్మెన్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షర్మిళ కూటమి నేతలతో కుమ్మకై పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని, రక్తం పంచుకున్న అన్నపై నిరాధారమైన ఆరోఫణలు చేయడం తగదన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో జగన్‌లాంటి సమర్ధ నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి ఉండటం ఆంధ్రుల అదృష్టమని పేర్కొన్నారు. మాట తప్పని...మడమ తిప్పని నాయకుని చెంత కోట్ల మంది అభిమానులు ఉన్నారనే విషయాన్ని గుర్తు చేసారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్‌రెడ్డి అభిమానులు ఎవరు షర్మిళ వెంట లేరని విషయాన్ని గుర్తించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి సంపాదనలో 40శాతం వాటా ఇస్తున్నా...ఇంకా కావాలనడం షర్మిళ అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. షర్మిళ రక్త సంబంధాన్ని కాలదన్ని...కూటమి నేతల చెక్కు చేతలలో బందీ అయిందని ఆరోపించారు. జగన్ పాలిట సికండిలా తయారైంది షర్మిళ అని ఆరోపించారు. చంద్రబాబునాయుడు తాను సంపాదించిన ఆస్తిలో చెల్లేలకు తమ్ముడికి పంచారా! అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డిని సమూలంగా నాశనం చేసేందుకు షర్మిళ కుట్ర చేస్తున్నారని భూమన ఆరోపించారు.



## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిలో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు

## నేడు పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

## నేడు కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ స్థాయిలో సోమవారం కుప్పం కడ కార్యాలయం సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ప్రజలనుంచి వినతులుసీ వ్రకరించడంజరుగుతుందన్నారు. నియోజకవర్గప్రజలుసద్వినియోగం చేసుకో వా లన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

## ఇరవై కిలోల గంజాయి స్వాధీనం ...ఇద్దరు అరెస్ట్

శాంతిపురం/రామకుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త

శాంతిపురం, రామకుప్పం మండలాల్లో అక్రమంగా గంజాయి సాగు చేస్తూ విక్రయాలు చేపడుతున్న ఇద్దర్ని అరెస్ట్ చేసి ఇరవై కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంకు చెందిన చంద్రప్ప తన పొలంలో గంజాయి చెట్లను సాగు చేస్తున్నట్లు గుర్తించి అతని నుంచి ఐదు కిలోల గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే రామకుప్పం మండలం వీర్నమల పంచాయతీ గురుకులమడుగుకు చెందిన కృష్ణన్ ఇంటి వద్ద 15కిలోల గంజాయిని, 400గ్రాముల ఎండిన గంజాయి ఆకులు స్వాధీనం చేసుకుని నిందితులు చంద్రప్ప, కృష్ణన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి సాగు, అక్రమ విక్రయాలు, రవాణా చేస్తే కఠిన చర్యలతో పాటు పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారంకు నూతన బోరు డ్రిల్లింగ్

కుప్పంరూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండలంలోని పైపాళ్యం బిసి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారంకు నూతన బోరు డ్రిల్లింగ్ పనులను ఆదివారం చేపట్టారు. కాలనీలో నీటి సమస్య నెలకొనడంతో ఇటీవల మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేసిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పురుషోత్తం, ఎంపిడిఓ సాయిలహరి గ్రామాన్ని సందర్శించి నూతన బోరు వేయాలని నిర్ణయించారు. దీంతో ఆదివారం కాలనీలో నూతన బోరు డ్రిల్లింగ్ పనులను చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సికె సుబ్రమణ్యం (మణి), యువనేత సికె విజయ్‌కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పార్టీ సభ్యత్వ నమోద్దు వేగవంతం చేయండి : ఎమ్మెల్యే థామస్



వెదురుకుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కార్యకర్తలు, నాయకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వియం. థామస్ పేర్కొన్నారు. మండలంలోని తిప్పినాయుడుపల్లెలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు చొరవ తీసుకుని విరివిగా సభ్యత్వం చేయించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేయడం కేవలం నాయకులు, కార్యకర్తలే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మాజీ జిల్లా టీడీపీ కార్యదర్శి మోహన్ మురళి, గంగాధరనెల్లూరు నియోజకవర్గం యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, నాయకులు నరసింహయాదవ్, బట్టే చాణిక్య ప్రతాప్, వరప్రసాద్, సుధాకర్, రాంబాబు, విజయనరసింహా రెడ్డి, వెంకటాద్రి నాయుడు, చిట్టెమ్మ, శ్రీనాథ్ రెడ్డి, చంద్రబాబు

## 108 నామాలతో కార్డులు, సీడీలు ఆలయానికి అందజేత

కాణిపాకం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు పెలైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారికి సంభందించి 108 నామాలతో ముద్రించిన కార్డులు, పాటల రికార్డింగ్ సీడీలను ఓ దాత ఆదివారం కాణిపాకం ఆలయానికి అందజేశారు. ఐరాల మండల పొలకలకు చెందిన హేమలత లనే భక్తురాలు స్వామివారిపై వున్న భక్తితో స్వామివారి 108 నామాలతో 1001 పుస్తకాలను ముద్రించారు. అలాగే 108 వినాయకుని నామాలతో పాటల రికార్డింగ్ చేశారు. వీటిని దాత హేమలత, దేవస్థానం కార్యాలయంలో ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతకు స్వామివారి దర్శనానంతరం తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## పాకాలలో అంబేద్కర్ సిద్ధాంతం

పాకాల, అక్టోబర్ 27, ప్రభాతవార్త



పాకాల స్థానిక అంబేద్కర్ కార్యాలయంలో అధ్యయన తరగతులలో 4వ ఆదివారం రోజున సీనియర్ జర్నలిస్టు బుద్ధిష్టు నాగరాజు ప్రత్యేక వక్తగా విచ్చేసి దేశంలోని పేదలకు బహుజనులకు విముక్తి మార్గం బౌద్ధం అన్నారు. తన జీవన ధర్మంగా సత్యాన్ని సత్యంగా ఉండడం వల్ల అవినీతికి అక్రమాలకు తావు లేకుండా ఉంటుందని బౌద్ధం అవసరం అని తెలిపారు. బౌద్ధం, కరుణ, ప్రేమ చూపిస్తుందని తెలిపారు. అందేకు ఆనాడు అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించి మనకు ఒక మార్గం చూపారు. ఆయన ఆశయాలు మనం ఆచరణలో చూపాలని, ఆనాడే మనం నిజమైన అంబేద్కర్ వాదులమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధిష్ట్ సోమయాజులు బుద్ధవంతను బుద్ధిని చరిత్ర గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నం, ప్రభు, ఆదికేశవులు, వెంకటేశు, ఆనందయ్య, నరసింహులు, ప్రభాకర్, రవి, నాగరాజు, మధు ఉదయ్, ఆనందయ్య, ప్రభాకర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## చిత్తూరులో జోస్‌అలుక్కాస్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

చిత్తూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, పలమనేరు రోడ్డులో సరికొత్త జోస్ అలుక్కాస్ జ్యువెలరీ షోరూంను చిత్తూరుశాసన సభ్యులు గురజాల జగన్మోహన్, సినీ నటి ఐశ్వర్య రాజేష్ తో కలసి ఆదివారం ప్రారంభించారు. ముందుగా జోస్ అలుక్కాస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కాస్, పాల్ జె అలుక్కాస్, జాన్ అలుక్కాస్‌లు. చైర్మెన్ జోస్‌అలుక్కాస్‌తో కలసి అతిధులకు ఘనస్వాగతం పలికి సత్కరించారు. సినీనటి ఐశ్వర్య మాట్లాడుతూ అత్యుత్తమ ఆఫర్లతో వైవిధ్యమైన కలెక్టన్లు జోస్‌అలుక్కాస్ అందిస్తున్నదనీ చిత్తూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనీ, అలాగే చిత్తూరు ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలకు, తనకు పూర్తి సహాయసహకారాలు అందించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంస్థ చైర్మెన్ జోస్‌అలుక్కాస్ మాట్లాడుతూ ప్రారంభోత్సవం సందర్భంగా అక్టోబరు 31లోపు 60వేలు విలువ కలిగిన బంగారు ఆభరణాలు, వజ్రాలను కొనుగోలు చేసిన వినియోగదారులకు ప్రోత్సహకంగా ఒక బంగారునాణాన్ని, వజ్రాల మీద 20శాతం తగ్గింపు, ప్లాటినమ్ ఆభరణాల మీద 7శాతం తగ్గింపు, వెండి ఆభరణాల మీద ఎలాంటి తరుగు ఛార్జీలు వుండవనీ, లక్కిడ్రాలో విజేతకు బంపర్ ప్రైజ్‌గా ఒక కారును బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### - ఎస్టీయు నాయకులతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించ డానికి తాను చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీయు అసో సియేట్ అధ్యక్షులు గంటామోహన్ ఆధ్వర్యంలో ఆదివారంఎస్టీయు నాయకులు ఎమ్మెల్యే గురజాల జగన్మో హన్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే ఎస్టీయు నాయకులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యే క దృష్టి కేంద్రీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, బోడే మోహన్‌యాదవ్‌లు, రాష్ట్ర ఎస్టీయు నాయకులు శ్రీదేవి, మునెప్ప, పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, నరేంద్ర, గుణశేఖర్, బాలాజీ, ఢిల్లీబాబు, సుబ్రమణ్యంపిళ్ళై తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బోయకొండలో జేబుదొంగను పట్టించిన మూడో నేత్రం

### -పోలీసుల అదుపులో నిందితుడు



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 27 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండలోని క్యూలైన్‌లో జేబుదొంగను ఆలయంలోని సిసి కెమరా పట్టించింది. ఆదివారం ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనింది. సందిట్లో సడేమియా అంటూ పుంగనూరు భగత్‌సింగ్ కాలనీకి చెందిన శ్రీకాంత్ క్యూలైన్‌లో తన చేతికి పనిచెప్పాడు. పీలేరు వెంకట్రమణారెడ్డి జేబులోంచి రూ. 10వేలను దొంగలిస్తూ ఆలయంలో అమర్చిన సిసి కెమరాకు చిక్కాడు. గుర్తించిన సిబ్బంది, పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## కాణిపాకం సన్నిధిలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ



**కాణిపాకం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినా యకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదా లను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట జిల్లా టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు సీఆర్.రాజన్, కోద ండయాదవ్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, నాయకులు సునీల్ చౌదరి, శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అడవి పంది మృతి ఘటనలో వ్యక్తి అరెస్ట్

తవణంపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

అడవి పందుల వేట కోసం వేటగాళ్ళు వేసి కరెంట్ ఉచ్చులో పడి అడవి పంది మృతి చెందిన సంఘటనలో నిందితున్ని ఆదివారం అరెస్ట్ చేసినట్లు అటవీశాఖ డీఆర్ఓ ఆనందరెడ్డి తెలిపారు. మండలంలోని ఎగువ మారేడుపల్లె, దిగువ మారేడుపల్లె గ్రామాల మధ్య గుర్తు తెలియని వ్యక్తులు అడవి పందుల వేట కోసం కరెంట్ తీగలతో ఉచ్చు అమర్చడంతో శనివారం వేకువజామున అడవి పంది చిక్కుకుని మృతి చెందింది. దీనిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈసంఘటనలో నిందితునిగా దిగువ మారేడుపల్లె గ్రామానికి చెందిన సురేంద్ర(45) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు డీఆర్ఓ ఆనందరెడ్డి తెలిపారు.

## ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు

ఐరాల, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

పార్టీ ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం మండలంలో ఘనంగా ప్రారంభించారు. మండలంలోని కలికిరిపల్లెలో జరిగిన కార్యక్రమంకు స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని తెలిపారు. పార్టీ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు హరిబాబునాయుడు లక్ష రూపాయలు చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈకార్యమ్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ ఎం.లతలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన అమరేంద్రరావు, వారి కుటుంబసభ్యులు నిత్యాన్నదానంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోటలో ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త



కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ- భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద నేత్రాలయం వారి సహకా రంతో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సిఇఓ సీతారామనాయుడు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను సీనియర్ వైద్య నిపుణులైన డాక్టర్లు భావన, రచనల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలిచ్చినట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 60 మందికి కంటి అద్దాలు, 20 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉచితంగా భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు వారు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న కంటి బాధితులు తరలివచ్చారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ట్రస్టు ఏఓ కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## జిడి రోడ్డుపై చెట్లు.. కనిపించని రోడ్డు

కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త



గూడూరు- దుగరాజపట్నం జిడి రోడ్డు కోట నుంచి 14 కిలోమీటర్లు వరకు ఉంది. కేశవరం నుంచి గూడూరు బైపాస్ రోడ్డు వరకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో రోడ్డుపై వచ్చిపోయే వాహ నాలు మలుపుల వద్ద కనిపించక పోవడం తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బి అధికారులు నిత్యం ఈ రోడ్డు వైపు కోట, వాకాడు మండలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురుగా వచ్చే వాహనం దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. బస్సుల్లో కూడా ప్రయాణికులు ఎదురెదురుగా వచ్చే సమయంలో బస్సు కిటికీల వద్ద ముళ్ల చెట్లు తగులుతున్నాయని చెప్తున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు చొరవ తీసుకొని రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోయిన ముళ్ల చెట్లను తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## నిత్యావసరాల ధరలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

### – వైసీపీ నాయకులు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి

కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త



ప్రభుత్వం నిత్యావసరాల ధరలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని గూడూరు నియోజకవర్గం వైసీపీ యువత అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం కోట మండలం విద్యానగర్‌లో విలేఖరులతో మాట్లాడుతూ దీపావళికి ముందే అన్ని రకాల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు దీపావళి పండుగను చేసుకునేలా కనిపించడం లేదని ఆరోపించారు. వంద రోజుల పాలన అని ప్రగల్భాలు పలుకుతున్న ఈ ప్రభుత్వం సామాన్యుడికి చేర్చాల్సిన నిత్యావసర వస్తువుల ధరలను కూడా అరికట్టడంలో పూర్తిగా విఫలమైనట్లు ఆరోపించారు. గత నెలలో వంద రూపాయలు ఉన్న లీటరు పామాయిల్ ధర ప్రస్తుతం రూ.137కు చేరుకోగా, సోయాబిన్ కిలో రూ.120 ఉండగా రూ.148కి చేరుకుందన్నారు. సన్‌ఫ్లవర్ నూనె రూ.120 నుంచి రూ.149కి చేరిందని చెప్పారు. వేరుశనగ నూనె రూ.140 నుంచి రూ.184కి పెరిగిందన్నారు. ఈ ప్రభుత్వం చేతగానితనం వలన ధరలు పెరిగిపోయాయని ఆరోపించారు. సూపర్‌సిక్స్ పథకాలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని ఘాటుగా విమర్శించారు. ఇసుక ఉచితం అంటూనే నాయకులు గ్రామగ్రామాన ఇష్టారీతిన దోచుకుంటున్నారని విమర్శించారు. కోట మండలంలో జరుగుతున్న ఇసుక దోపిడీని జిల్లా కలెక్టర్‌కు త్వరలో వివరిస్తామన్నారు.

## అబ్దుల్‌గని చొరవతో చెరువులో నీటి నిల్వలు

చిట్టమూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



చిట్టమూరు మండలంలోని సెక్షన్ 3కు సంబంధించిన ఇరిగేషన్ ఏఇ అబ్దుల్ గని ముందుచూపుతో కొన్ని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఓ వైపు నిధులు లేమి, మరమ్మతులకు నోచుకోని చెరువులు మరోవైపు దర్శనమిస్తుండటంతో చిల్లమూరు, యల్లసిరి గ్రామ రైతుల విజ్ఞప్తి మేరకు ఏఇ అబ్దుల్‌గని తన సొంత నిధులు వెచ్చించి చెరువులకు మరమ్మతులు చేయించడం పట్ల రెండు గ్రామాల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిల్లమూరు పంచాయతీకి చెందిన మిట్ట చెరువు కలుజు పూర్తిగా పాడైపోవడంతో వర్షాకాలంలో చెరువు నిండినప్పుడు చుక్కనీరు నిలిచే పరిస్థితి లేకపోవడంతో రైతుల మొరతో ఆయన సొంతంగా ఇసుక బస్తాలతో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. అలాగే మండలంలో మేజర్ చెరువు యల్లసిరి 6వ నంబర్ తూముకు మరమ్మతులకు గురై నీటి నిల్వలకు అవకాశం లేకపోవడంతో, ఆ తూముకు అవసరమైన మెటీరియల్‌ను తెప్పించి మరమ్మతులు చేపట్టారు. దీంతో చిట్టమూరులో అబ్దుల్‌గని సేవల పట్ల శభాష్ అంటూ పలువురు అన్నదాతలు, రాజకీయ పార్టీల నేతలను ఆయన సేవలను కొనియాడారు.

## అయ్యప్ప ఆలయం అభివృద్ధికి కృషి చేస్తా

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 27, ప్రభాతవార్త



పట్టణం కుమ్మరి గుంట వద్ద ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పూజ నిర్వహించారు. 40 రోజులు పాటు అయ్యప్ప ఆలయంలో మాలాధారణ భక్తులకు అన్నదానం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పరిశీలించారు. అయ్యప్ప స్వామికి కొబ్బరికాయ కొట్టి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. 40 రోజులు పాటు మాలాధారణ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యేకి నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ విశ్వనాథర్, ఆలయ నిర్వాహకులు వల్లభనేని మధు నాయుడు, శ్రీనివాసులు, గురునాథం పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

### మాజీ చైర్ పర్సన్ దొంతు శారద

వెంకటగిరి, అక్టోబర్ 27, ప్రభాతవార్త



పట్టణంలోని కుమ్మరకుంట వద్ద వెలసి ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దొంతు శారద, దొంతు బాలకృష్ణలు ప్రారంభించారు. అయ్యప్ప మాలధారణ భక్తులకు మొదటి రోజు బాలకృష్ణ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులకు తమ వంతు విరాళంగా మొదటి రోజు అన్నదానం నిర్వహించారు. ముందుగా అయ్యప్ప దేవాలయంలో వారు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు శారద బాలకృష్ణను సత్కరించారు. భక్తులకు స్వయంగా వారు అన్నాన్ని వడ్డించారు. 40 రోజులు పాటు అయ్యప్ప మాల దండ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి గురునాథం తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ నిర్వాహ కమిటీ వారు శ్రీనివాసులు, మధు నాయుడు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## గుణ్ణం సేవా ట్రస్ట్‌చే పేదలకు పలసరుకుల పంపిణీ

గూడూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం గుణ్ణం సేవా ట్రస్ట్ అధినేతలైన గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి, రాధారెడ్డి ఆర్థిక సహకారంతో పలసరుకుల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 25 మంది పేదలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు ముఖ్య అతిథిగా విచ్చేసిన గుణ్ణం రెడ్డి రాధా రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి రవీందర్ రెడ్డి, సనత్ కుమార్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, మండి శ్రీనివాసులు రెడ్డి, ప్రజేంద్ర రెడ్డి, ఎరమాక కృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, పల్లమాల హరినాథ్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**- రెడ్డి సంఘం పేద విద్యార్థికి ఆర్థిక సాయం..**

గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చదువుతున్న శిరీషకు డా. సి. జనార్దన్ రెడ్డి 1000 0 రూపాయిలు ఆర్థిక సహాయం అందించారు. రెడ్డి సంఘం సభ్యులు జనార్దన్ రెడ్డిని అభినందించారు.

## స్కూల్ ఆయాలకు వేతనాలు పెంచాలి: సిఐటియు

వెంకటగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నటువంటి ఆయాల వెంకటగిరి మండల జనరల్ బాడీ సమావేశం ఆదివారం సిఐటియు ఆఫీసు వద్ద పి. రాజమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయాలను ఉద్దేశించి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ స్కూలు ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యూనియన్‌గా ఏర్పడి సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్నటువంటి ప్రతి ఒక్కరికి యూనియన్లు ఉన్నాయని అన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎవరికి వారు విడిగా ఉంటే ఏమీ సాధించలేమని అన్నారు. సంఘం పెట్టుకొని ఐక్యమత్యంతో సమస్యలపై కొట్లాడాలని పోట్లాడాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలేమో ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. జీతాలు మాత్రం పెరగడం లేదని అన్నారు. స్కూలు ఆయాలకు కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. క్యాజువల్ లీవులు ఇవ్వాలని నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని అన్నారు. నెల నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని అన్నారు. ఆయాల డిమాండ్స్ సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. స్కూల్ స్వీపర్స్ యూనియన్ వెంకటగిరి మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా నిర్మల, అధ్యక్షులు టి. మమత, కార్యదర్శి పి. రాజమ్మ, కోశాధికారి జి. సుశీల, ఉపాధ్యక్షులు పి. ధనమ్మ, వి. లక్ష్మి, సహాయ కార్యదర్శులు సిహెచ్ కృష్ణవేణి, మల్లీశ్వరి, మాధవి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## అధ్వానంగా ఉన్న వెంకటరెడ్డి పాలెం ఆర్‌అండ్‌బి రోడ్డు

వాకాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త



మండల పరిధిలోని నెల్లిపూడి గ్రామ పంచాయితీలో వున్నా వెంకటరెడ్డిపాలెం ఆర్‌అండ్‌బి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు రోడ్డుపైన నీరు చేరిపోయి రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతుంది. దానికి తోడు పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు గురవుతన్నారు. రాత్రిపూట గుంతల్లో విషసర్పాలు, తేలు తిరుగుతుంటాయి. భయం ఆందోళనలో ప్రజలు ఆ రోడ్డుపైన తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్లమీద పిచ్చి కుక్కలు కూడా తిరుగుతూ ప్రజలను భయం ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎన్నో ఏళ్లగా ఆర్‌అండ్‌బి రోడ్డుతో పాటు, వీధులలో సిమెంట్ రోడ్డు లేక ఆ ప్రాంత ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్, సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

వెదురుకుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :



మంకీబాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాములు శేషాద్రి ఆధ్వర్యంలో మండలంలోని తెల్లగుండ్లపల్లెలో వీక్షించారు. సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ గురించి వివరించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గురించి, పెరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. యోగా అవసరాన్ని ఆవశ్యకతను తెలిపారు. విద్యార్థులలో క్రీడలపట్ల ఆశక్తి పెంపొందించాలని, కబడ్డీ, కోకో నేర్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు కార్యకర్తలు ఢిల్లీ, సాయి, దయ, కృప, మునికృష్ణ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి ఏనుగు దారి మళ్లించిన అటవీ అధికారులు

కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగును అటవీ అధికారులు, సిబ్బంది దారి మళ్లించారు. తమిళనాడునుంచి వచ్చిన ఒంటరి మదపుటేనుగు వారం క్రితం కుప్పం మండలం కంగుంది మీదుగా రామకుప్పం మండలం పిఎంకె తాండా అటవీ ప్రాంతానికి చేరింది. అయితే అక్కడ అడవిలో ఉంటుందనుకున్న ఏనుగు ఈనెల 22వతేది రాత్రి పిఎంకె తాండా సమీపంలో పొలాల వద్ద ఉన్న రైతు రెడ్యానాయక్‌ను హతమార్చింది. దీంతో ఈ ఏనుగును దారి మళ్లించాలని అటవీ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. శనివారం మరలా కుప్పం మండలం నాయనూరు అటవీ ప్రాంతం మీదుగా నడిమూరు అటవీ ప్రాంతంలోకి.. అక్కడనుంచి తమిళనాడు అటవీ ప్రాంతానికి తరిమేశారు.

## తొట్టంబేడు పంచాయతీలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం

.తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



మండలంలోని తొట్టంబేడు పంచాయతీలో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్థానిక శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనల మేరకు 2024-26 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీకి కంచుకోటగా ఉన్న తొట్టంబేడు పంచాయతీ నుంచి సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు తెలిపారు. ఈసందర్భంగా తెలుగుదేశంపార్టీకి కంచుకోట అయిన తొట్టంబేడు నంఉచి ప్రారంభించి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం, రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందవచ్చని ప్రమాదశాత్తు మరణిస్తే గతంలో రూ.2లక్షలు బీమా ఉండేదని ప్రస్తుతం రూ.5లక్షలుగా పెంచారన్నారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా బిల్లులు ఉన్నట్లుయితే వాటికి కూడా రుణాన్ని చెల్లిస్తారన్నారు. తల్లికి వందనం, ఉచిత ఇసుక విధానం ఒక్కొక్క హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మహిళలకు పెద్దపీఠ వేసిన చరిత్ర కూటమి ప్రభుత్వాలకు దక్కుతుందన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు అవినీతి రూపు మాపే విధంగా ప్రభుత్వం పనిచేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలసుబ్రమణ్యం, భాస్కర్, వెంకటేష్, సునీల్‌కుమార్, లోకేష్, దామోదరం, సుబ్రమణ్యం, బాబు, మునిరత్నం, లక్ష్మమ్మ, కృష్ణవేణి, ధనలక్ష్మి, చంద్రమ్మ, సుబ్బయ్యతదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు మంచిపేరు తీసుకురండి: బొల్లినేని

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



క్రీడాకారులకు నిలయమైన శ్రీకాళహస్తి నుంచి పోటీలకు పరుగులు తీస్తున్న యువకులు తమ ప్రతిభను చూపి జిల్లా సత్తాతో పాటు శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఉమ్మడి చిత్తూరుజిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మెన్ బొల్లినేని జగన్నాధం నాయుడు పిలుపు నిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జగన్నాధం నాయుడుమాట్లాడుతూ నంద్యాలలో నవంబర్ 8 నఉుంచి 10వ తేది వరకు జరగనున్న సీనియర్ పోటీలలో పాల్గొని తమ సత్తా చాటాలన్నారు. శ్రీకాళహస్తిలోని క్రీడాకారులను ప్రోత్సహించటంలో యువతీ యువకులు ముందంజలో ఉండటం అభినందనీయం అన్నారు. జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. శ్రీకాళహస్తి అంటే ఆది నుంచి క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. అదే బాటలో నేటి యువత పయనించి సత్తా చాటాలన్నారు. ఈ సందర్భంగా జగన్నాధం నాయుడును సత్కరించారు.

## 1న కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏడాది నిర్వహించే దీపావళి సందర్బంగా కేదార గౌరీ వ్రతాన్ని నవంబర్ 1 శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటలకు శ్రీకృష్ణదేవరాయల మండపం వద్ద ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. గ్రామాల నుంచి వచ్చే భక్తులు గుర్తించాలని ఇఓ కోరారు.

## సబ్సీడీపై రుణాలు మంజూరు చేయండి:గోదాములు నిర్మించండి

### గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా సమావేశం, నూతన కార్యవర్గం ఏర్పాటు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



తిరుపతిజిల్లాలో గాండ్ల సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలని ఆదివారం జరిగిన జిల్లా గాండ్ల సంక్షేమ సంఘం సమావేశంలో పలువురు వక్తలు కోరారు. జిల్లా నూతన కార్యవర్గం ఎంపికను నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని ఎన్‌వియస్ కళ్యాణమండపంలో జిల్లా కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ సంఘ అధ్యక్షులుగా శ్రీకాళహస్తికి చెందిన మాజీ స్కిట్ కళాశాల చైర్మెన్ వంజవాకం గురుదశరథన్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావుమాట్లాడుతూ గాండ్ల కులస్థులు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారన్నారు. వీరు సీజనల్ వ్యాపారం చేస్తున్నారన్నారు. ఒకప్పుడు జిల్లాలో వేరుశెగన విస్తారంగా పండించే వారని కానీ నేడు ఈ పంట లేకపోవటంతో వ్యాపారాలను బయటి ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి చేయాల్సి వస్తుందన్నారు. అయితే గాండ్ల కులంలో అధిక శాతం మంది నిరుపేదలే అని వారికి ప్రభుత్వం రుణాలు సబ్సీడీలతో అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యుత్ సరఫరా తాము కొనుగోలు చేసిన సరకులను నిల్వ చేసుకొనుటకు గోదాములు నిర్మించాలని కోరారు. గతంలో పరిపాలించిన పాలకులకు ఎన్నో సార్లు తమ డిమాండ్లకు సంబంధించి విన్నవించినా, ముఖ్యమంత్రికే మొరబెట్టుకున్నా పరిష్కరించబడలేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేసారు.

***అన్ని పరిష్కరించుకుందాం:***

నూతన అధ్యక్షుడుగా వంజవాకం గురుదశరథన్‌ను ఏకగ్రీవంగా అఖిల భారత రాష్ట్ర గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం సారధ్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా గురుదశరథన్ మాట్లాడుతూ గతంలో ఏం జరిగిందో తెలియదు. కానీ నేడు మన సంక్షేమాన్ని కాంక్షించే నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మనం మన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విన్నవించి పరిష్కరించుకుందామని గురుదశరథన్ భరోసా ఇచ్చారు. ఈసందర్బంగా ఆయన సారధ్యంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఓ గిరిధర్ ఉపాధ్యక్షులుగా బిఎం రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సుధాకర్ ఎన్నుకున్నారు.

## కేశవ సేవా సమితిచే సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం

తిరుపతి హెల్త్, అక్టోబర్ 27, ప్రభాతవార్త



తిరుపతిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ రైల్వే కాలనీలో కేశవ సేవా సమితి, సేవా భారతి ఆధ్వర్యంలో శ్రీరామ్ గురూజీ హైదరాబాద్ వారి వైద్య బృందం డాక్టర్ కె. కిరణ్ కుమార్, ఈ. రాఘవేంద్రచే సిద్ధి ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గత ఆరు నెలలుగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని డాక్టర్ పి. గోపికృష్ణ ప్రముఖ కంటి వైద్య నిపుణులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో మన పూర్వీకులు కనుగొనిన ఆయుర్వేదము లాంటి అనేక వైద్య చిట్కాలు ఉన్నాయని దానిలో కేరళ వైద్యమైన సిద్ధ ఆయుర్వేద యోగ వైద్యము పురాతనమైనదని దాని వలన కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, మెడ నొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్న ఈ వైద్యం వల్ల ఉపశమనం కలిగిందని అందుకు నాకు చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. కొన్ని అల్లోపతి వైద్యంతో నయం కానివి మన పూర్వీకులు కనుగొన్న వైద్య చిట్కాలతో నయమవుతున్నాయని ఆయన చెప్పారు. దేశములో అన్ని రుగ్మంతలకు వైద్యం ఉన్న అందుబాటులో లేవని మన ప్రచారం ద్వారా వాటిని అందుబాటులోకి తెచ్చి ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయాలని శిభిరానికి వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ క్యాంపు నిర్వాహకులు గందబడి మునిరత్నం మాట్లాడుతూ ఈ వైద్య శిభిరాన్ని ఇంకా మేము ముందుకు తీసుకెళ్తామని శాశ్వత ప్రాతిపదికలో రోగులకు నిరంతరం సేవలు అందించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. 65 మందితో జరిగిన ఈ శిభిర ప్రారంభోత్సవ సమయంలో డాక్టర్ పగడాల ఈశ్వర ప్రసాద్, తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ సహాసేవ సేవ ప్రముఖ జి. మునిరత్నం, డాక్టర్ కీర్తి వెంకయ్య, మంజువాణి, ఆర్ఎస్ఎస్ తిరుపతి జిల్లా సహ బౌద్విక్ ప్రాముఖ్ టి. దనుంజయ, ఎం. రాజేంద్ర, శరవణ పాల్గొన్నారు.

## 'బ్రహ్మమొక్కటే..పరబ్రహ్మం ఒక్కటే' పాటపై పోటీలు

తిరుపతిరూరల్, అక్టోబర్27 ప్రభాతవార్త:



వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైం దుకు నవంబర్ 10న 'బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మం ఒక్కటే' పాటపై పోటీలు నిర్వహిస్తున్నట్లు వీక్ష స్కూల్ కరస్పాం డెంట్ డాక్టర్ తాతిరెడ్డి రామాకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వీక్ష స్కూల్లో 'వండర్ బుక్ ఆఫ్ రికార్డు'లో పోటీలో పాల్గొనందుకు అన్నమయ్య డాన్స్ అకాడమీ డాక్టర్ శ్రీరాంబాబు ఆధ్వర్యంలో సామూహికంగా కోలాట నృత్యం చేసారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుటకు 2024 మందితో నవంబర్ 10న ఎస్వీ యూనివర్సిటీలో శ్రీజ్ఞానపద వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అన్నమయ్య కీర్తన భక్తి పాటపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాలనే తపన ఉన్న 6 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్కులు వరకు పాల్గొనవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 9603050414 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీక్ష స్కూల్ ప్రధాన ఉపాధ్యాయరాలు ఆర్.కె.విమల, రవిచంద్రబాబు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వమంటే జీవితానికి భరోసా

**పుంగనూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త :** దేశంలోనే ఏపార్టీ కూడా కార్యకర్తలకు అందించని భరోసాను తెలుగుదేశం పార్టీ అదినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్నారని, టిడిపి అంటేనే కార్యకర్తల జీవితానికి భరోసా అని సామాజిక వేత్త, దేశం నాయకుడు సయ్యద్ సుహేల్‌బాషా అన్నారు. వంద రూపాయల పార్టీ సభ్యత్వంతో ఐదులక్షల బీమా సదుపాయాన్ని కల్పించి కార్యకర్తల భవిష్యత్తుకు పునాది వేశారన్నారు. ఈసందర్బంగా వందలాది మందికిపార్టీ సభ్యత్వాన్ని ఆయన అందచేశారు. తెలుగుదేశం అంటే కార్యకర్తలకు వెన్నుదన్ను అని, రాష్ట్ర మంత్రి లోకేష్‌బాబు సహకారంతో పార్టీను ముందుకు తీసుకువెడుతామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమాలలో మాజీ కౌన్సిలర్ అబ్బాస్, నాయకులు శ్రీనివాసులు, సద్దాం, అస్లం, సయ్యద్, రషీద్, హుస్సేనలతో పాటూ పార్టీనాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పుత్తూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో యువ కుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా... పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామా నికి చెందిన లోకేష్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన శుక్రవారం సాయంత్రం అదే కంపెనీలో పని చేస్తున్న యువకుడితో కలసి ద్విచక్రవాహనంపై ఎస్ఆర్ పురం వెళుతుండగా కార్వేటినగరం మండలం పద్మ సరస్సు వద్ద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లోకేష్‌కు తలకు గాయమైంది. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

## కరాటే పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



పట్టణంలోని సింహపురి కరాటే అకాడమీ కోచ్ కె.ధనుష్ ఆధ్వర్యంలో జు జుట్స్ ఛాంపిచన్ షిప్ టోర్నమెంట్‌ను ఆదివారం రాష్ట్ర చాంపియన్స్ కావలి పట్టణం పాతంబి రామకళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో జు జుట్స్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం విద్యార్ధులు తమ ప్రతిభను చాటారు. ఈసందర్భంగా కోచ్ ధనుష్ ఆధ్వర్యంలో 4 మెడల్స్ సాధించడంతో పాటు, అలాగే జోషిత్ 45కిలోల విభాగంలో బంగారు పతకం సాధించగా, 42కిలోల విభాగంలో లితిక బంగారు పతకం, లాగే 28 కిలోల క్లారిస్ కాంస్యపతకం సాధించారు. ఈసందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు కార్యదర్శి యాసిన్ మీదుగా మెడల్స్ అందించారు. సింహపురి కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఎక్కడ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఖచ్చితంగా తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికే కాకుండా తిరుపతి, చిత్తూరు జిల్లాకు మంచిపేరు తీసుకువస్తున్నారని కోచ్ వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## యుటిఎఫ్ తొట్టంబేడు మండల కమిటీ ఎంపిక

తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



యుటిఎఫ్ తొట్టంబేడు మండల కమిటీ ఎంపిక ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా తొట్టంబేడు మండల శాఖ మహాసభను నిర్వహించారు. అధ్యక్షులుగా వి.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డిల్లీబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిధులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల హాజరయ్యారు. వచ్చే ఏడాది జనవరి 5వతేదీ నుంచి నాలుగురోజుల పాటు కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. స్వర్ణోత్సవ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, కె.మోహన్‌బాబు, సి.వెంకటకృష్ణ, దీపిక, హేమాంబరదరరావు, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 12వ పిఆర్సీ కమిషన్ నియమించి బకాయిలు విడుదల చేయాలి

-ఏపిటిఎఫ్

తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త




12వ పిఆర్సీ కాలం ఏడాది దాటినా ఇంత వరకు మధ్యంతర భృతి ప్రకటించలేదని వెంటనే ఐఆర్ ప్రకటించి అన్ని పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని ఏపిటిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం తిరుపతి జిల్లా ఏపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ జూలై 2023 నుంచి 12వ పిఆర్సీ కమిషన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయాలి కానీ ఇంతవరకు కమిషన్ ఛైర్మన్‌ను నియమించలేదనానరు. గతంలో ఉన్న ప్రభుత్వం 11వ పిఆర్సీని రద్దు చేసి వేతనాలు తగ్గించి అన్యాయం చేసిందని ప్రస్తుత నూతన ప్రభుత్వమైనా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. ఏపిజీఎల్ఐ, సరెండర్ లీవ్, ఎన్క్యాష్‌మెంట్, పదవీ విరమణ అనంతరం చెల్లింపులు, సిసిఎస్ మార్టిన్ గ్రాంట్ తదితర బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాడు నేడు పనులతో పెండింగ్ పనులు చేసేందుకు పాఠశాలలకు కావాల్సిన నిధులు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వీటిపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కె.వెంకటాద్రి మాట్లాడుతూ పదవీ విరమణ అధిక సంఖ్యలో జరిగిన పరిస్థితుల్లో విద్యాశాఖలో అద్యాపకుల కొరత ఉందన్నారు. ఉన్నత పాఠశాలలు, మండల విద్యాశాఖాధికారి ఖాళీలను ఆగిపోయిన నెలవారీ పదోన్నతులు పునరుద్ధరించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకే వర్తించేలా చేసి జనవరి 1నే చెల్లించాలన్నారు. ప్లస్ 2 పాఠశాలల్లో ఇంటర్ తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు 24సంపాదిత సెలువులు మంజూరు చేసి జాబ్ చార్టును విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఏపిటిఎఫ్ పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.సుధాకర్, జిల్లా ఇన్‌ఛార్జి చెంచురాజు, జిల్లా ఉపసంఘం సభ్యులు ఆర్.గోపాల్, మునస్వామి, సురేష్‌బాబు, ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

-అర్బన్ సిఐ గోపి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్‌హ్యాండ్ సేవా సంస్థ కార్యక్రమాలు అభినందనీయం అని అర్బన్ సిఐ గోపి అన్నారు. ఆదివారం ఉదయం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 155వ నెల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఆయనకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు మునీర్ బాషా స్వాగతం పలికారు. ఈసందర్బంగా అర్బన్ సిఐ గోపి మాట్లాడుతూ ప్రతినెల ప్రత్యేక ప్రతిభావంతులుకు, వృద్దులకు నిరంతరం సరుకులను పంపిణీచేయడం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవాతత్పరతకు నిదర్శనమన్నారు. సేవా కార్యక్రమాల్లో తమను కూడా భాగస్వామ్యం చేయడం ఎంతో అభినందనీయమని తాము కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షాకిరాలీ, న్యాయవాదులు గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, సంస్థ సభ్యులు డిల్లీబాబు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం

**తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



ద్యానం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బహదూరుపేటలోని పాత పోస్టాఫీస్ పక్కనే జ్ఞానప్రసూనాంబ ధ్యాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాయుడు పేటకు చెందిన రాఘవేంద్రరావు మరియు సంస్థ ఛైర్మన్ సుబ్బారావులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈసందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఇప్పుడున్న కంప్యూటర్ యుగంలో పిల్లలు, పెద్దలు, అధిక ఒత్తిడికి గురవుతున్నారని దీనికి విరుడుగు ధ్యానమే అన్నారు. ప్రతి ఒక్కరు ధ్యానం ద్వారానే మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అలాగే ధ్యానం అంటే సకల రోగ నివారిణి అన్నారు. పట్టణ ప్రజలు ఇక్కడ ఉచితంగా ధ్యాన్యం నేర్చుకోవచ్చున్నారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ఛైర్మన్ రంగయ్య, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు.

## నేడు మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త



తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 28వ తేది సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు, ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కమిషనర్ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా ముగిసిన అయ్యప్ప స్వామి మండల పూజ

పుత్తూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి అంబికా సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మండల పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పుష్కర మహా కుంభాభిషేకం నిర్వహిం చారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 40 రోజుల తరువాత మండల పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక కలిశాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. అలాగే ప్రత్యేక హోమాలు కూడా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని వినాయక స్వామికి మంజుమాత దేవికి నాగదేవతకు మూల విగ్రహం అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

విజయపురం, అక్టోబరు 27 ప్రభాతవార్త:



మండలంలోని మహారాజపురానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నగరి నియోజకవర్గ రైతు విభాగం కన్వీనర్ డి.సుబ్రహ్మణ్యంరాజు తమ్ముడు డి.రామచంద్రరాజు(60) ఆదివారం అనారోగ్యంతో తమిళనాడు ఓ ప్రైవేటు ఆస్పత్రిలోచికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం దహన క్రియలు స్వగ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన మృతదేహానికి చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు దశరథరాజు, కొండూరు దాము, వెంకటేశులు యాదవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మెడికల్ ఎమర్జెన్సీ కౌన్సిల్ చైర్మన్‌ని కలసిన వెంకటాద్రి యాదవ్

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:



ఆలిండియా మెడికల్ ఎమర్జెన్సీ కౌన్సిల్‌చైర్మన్ డా. శ్రీనాథ్‌ను బీజేపీ యువ నాయ కులు వెంకటాద్రి యాదవ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలసి తన అభిమానాన్ని చాటుకున్నారు. శ్రీకాళహస్తి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి కుటుంబ సమేతంగా డా. శ్రీనాథ్ వచ్చారు. ఆయనను కలసి వెంకటాద్రి యాదవ్ తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారతదేశం మందులు తయారు చేయడంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని, కోవిడ్ తరువాత భారతదేశం ప్రపంచంలో అగ్రగామి అయిందని, దేశంలోని అన్ని ఆస్పత్రులకు నిర్ణీత సమయానికి వైద్యం అందించడానికి మందులు సరఫరా చేస్తున్నట్టు తెలిపినట్టు వెంకటాద్రి యాదవ్ అన్నారు.

## సభ్యత్వ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపండి..!

### టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులు ప్రత్యేక చూపాలని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురంలోని టిడిపి కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. మండలాన్ని రాష్ట్రంలోనే ప్రధమ స్థానంలో నిలపాలన్నారు. ప్రతి కార్యకర్త తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులచే నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, నరశింహారెడ్డి, బింధుమాదవి, సురేంద్ర నాయుడు, కొట్టే గిరిధర్ రెడ్డి, మహేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను దూషించిన స్టార్ కృష్ణపై చర్యలు తీసుకోవాలి

### దళిత మహిళలు డిమాండ్

తిరుపతి హెల్త్, అక్టోబర్ 27, ప్రభాతవార్త




మహిళలు అన్న విషయాన్ని చులకన భావంతో తమను దుర్భాష లాడుతూ బెదిరింపులకు పాల్పడిన స్టార్ కృష్ణ అలియాస్ కాకి కృష్ణయ్య పై సంబంధిత అధికా రులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వడమాలపేట మండలం ఎస్‌వి పురం దళిత మహిళలు హేమావతి, ఉమాదేవి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడుతూ ఓ సమస్య పైన తాము ఏర్పేడు పోలీస్ స్టేషన్స్ వెళ్లడం జరిగిందన్నారు. అయితే అక్కడ ఓ రైతు నుంచి కొనుగోలు చేసిన భూమిపై తాను నష్టపోయానంటూ ఆ భూమికి రోడ్డు లేదంటూ ఆ రైతును దళితుడైన స్టార్ కృష్ణ బెదిరించారని తెలిపారు. నాకు తగిన సొమ్ము ఇవ్వకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని రైతును బెదిరించడంతో అక్కడే ఉన్న తమకు రైతు జరిగిన విషయాన్ని వివరించారన్నారు. దీంతో స్టార్ కృష్ణ చేస్తున్న తప్పుడు పనులను వద్దన్నందుకు తమపై స్టార్ కృష్ణ దౌర్జన్యానికి దిగారని వాపోయారు. అంతేకాకుండా జనం మధ్యలో ఇష్టారాజ్యంగా దూషిస్తూ బెదిరింపులకు పాల్పడాలని తెలిపారు. స్టార్ కృష్ణ ఆర్టీసిలో కండక్టర్ నుండి సూపర్వైజర్‌గా పనిచేస్తూ దళిత నాయకుడు అని చెప్పుకుంటా అనేక దందాలకు పాల్పడుతూ అధిక మొత్తంలో ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. ఆర్టీసి డ్రైవర్ భార్య నువ్వు నన్ను ఎదిరిస్తావా అంటూ నీ భర్తను ఉద్యోగం నుంచి తొలగిస్తానని తనపై బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. కులం పేరుతో సొంత ఆస్తులు పెంచుకోవడం తప్ప దళితులకు ఆయన ఎప్పుడూ న్యాయం చేసిందిలేదని తెలిపారు. న్యాయం చేయకపోగా ఇది తప్పు అని చెప్పినందుకు నోటితో చెప్పలేని విధంగా దుర్భాషలాడుతూ నాపై ఇష్టం వచ్చినట్టు దూషిస్తూ, నాపై దౌర్జన్యం చేసి, బెదిరించి, భయపెట్టిన స్టార్ కృష్ణపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పత్రికాముఖ్యంగా విజ్ఞప్తి చేశారు. దళిత మహిళలు ఏ మణెమ్మ, కె. మంజుల, సి. నాగేశ్వరి, ముని వెంకటరమణ పాల్గొన్నారు.

## దివ్యారామంలో వాకర్స్‌తో ఎమ్మెల్యే

తిరుపతి హెల్త్, అక్టోబర్ 27, ప్రభాతవార్త



తిరుపతి కపిలతీర్థం అలిపిరి రోడ్డులో దివ్యారామంలో వాకర్స్‌తో తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు మమేకమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నడకలో భాగంగా, ప్రజలతో నేరుగా సత్సంబంధాలు ఏర్పడేందుకు తిరుపతిలోని 15 వాకర్స్ పార్కులలో ఒక్కొక్క రోజు ఒక పార్క్ చొప్పున వాకర్స్‌తో మమేకమై తిరుపతి నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేస్తున్నారు. ఎమ్మెల్యే తమ మధ్య వాకింగ్ చేయడం ఆనందంగా ఉందని వాకర్స్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, గురునాధం, కృష్ణకాంత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# సత్వరం ఆర్థిక బకాయిలు చెల్లింపు

## - యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం డిమాండ్




చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:
ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు సత్వరం విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం ప్రభుత్వంను డిమాండ్ చేసింది. జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాశాఖలో విధ్వంసం జరుగుతున్న జిఓనెం.117 రద్దు చేయడానికి ప్రభుత్వం పూనుకోవడం ఆనందదాయకమన్నారు. 2023 జులై నుండి ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన వేతన కమిటీని నియమించి 33 శాతం మధ్యంతర భృతి, దీపావళి పండుగ సందర్భంగా ప్రకటించాల్సిన కరవు భత్యం(డిఏ)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే నవంబర్ 3, 4వ తేదీల్లో పూతలపట్టులో జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వరలక్ష్మిని డిఇఓ కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్‌లు, నాయకులు సుధాకర్‌రెడ్డి, పిఆర్ మునిరత్నం, ఎస్. రెహెనాబేగం, ప్రసన్నకుమార్, టి.రఘుపతిరెడ్డి, దీనావతి, సిపి ప్రకాష్, ఎస్‌పి భాషా, కృష్ణమూర్తి, రెడ్డప్పనాయుడు, కె.సరిత, డి.ఏకాంబరం, బి.ఈశ్వర్‌మహేంద్ర, ఎం. పార్థసారధి, కె.గణేష్‌కుమార్, ఎంవి రమణ, సాధనకుమార్, బిసికె ప్రసాద్, రవీంద్రబాబులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల్ని గెలిపించాలి

**- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**
**- బెంగళూరులో పట్టభద్రుల ఆత్మీయ సమావేశం !!**



కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త
త్వరలో జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులైన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరంలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కోరారు. ఆదివారం బెంగళూరు నగరంలోని కృష్ణ సుమిత్ కన్వెన్షన్ సెంటర్‌లో బెంగళూరు తెలుగు ఫోరం, కృష్ణ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పట్టభద్రులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల పాల్గొని ప్రస ఒగించారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆలపాటి రాజా, పేరాబత్తుల రాజశేఖరంలను ప్రకటించడం జరిగిందన్నారు. బెంగళూరు నగరంలో స్థిరపడిన ఉభయగోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల పట్ట భద్రులు వీరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలుగువారు ఎక్కడున్నా తెలుగుదేశం పార్టీని ప్రేమాభిమానాలతో ఆదరిస్తారని మరోమారు రుజువు చేయాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి విధిగా ఓటరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యావంతులైన ఆలపాటిరాజా, రాజశేఖరంలను ఆదరించి గెలిపించాలని కోరారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రాజనాలబండ భక్తులకు అందని ద్రాక్షలా శుద్ధజలం

చౌడేపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ భక్తులకు శుద్ధజలం అందని ద్రాక్షలా తయారైంది. బండపైగల ప్రసన్న ఆంజనేయ స్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామిలను దర్శించుకొనేందుకు భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యంగా శనివారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సత్యప్రమాణాలు చేస్తారు. మంచినీటి వసతి లేక భక్తులు పడే అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుతం రాజనాలబండ టిటిడి ఆధీనంలో వుంది. దీంతో భక్తులకు మెరుగైన సేవలందిస్తారని స్థానికులు చంకలెగేరుసుకొన్నారు. అభివృద్ధి మాట పక్కన బెడితే బండకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యం అయిన మంచినీరందించే వారు లేకుండా పోయారని. శుద్ధజలం అందించే క్రమంలో మిషనరీని సరఫరా చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకొనే వారు కరువయ్యారని భక్తులంటున్నారు. మిషనరీ అమర్చేందుకు షెడ్డును ఏర్పాటు చేసారు. అన్నింటికంటే ముఖ్యంగా బోరుకు ఇటీవల మోటారు అమర్చారు. అన్నీ వున్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా బోరు, షెడ్డు, మిషనరీ వున్నప్పటికీ అమర్చే దిక్కులేరని భక్తులంటున్నారు. ఇకనైనా టిటిడి అధికారులు స్పందించి భక్తులకు శుద్ధ జల యంత్రాన్ని అమర్చి దాహార్తిని తీర్చాలని వారు కోరుతున్నారు.

## పట్టపగలే వెన్నెల

### అధికారుల నిర్లక్ష్యమా? విద్యుత్తు అధికారుల పర్యవేక్షణ లోపమా?

దొరవారిసత్రం, అక్టోబర్ 27, ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల పరిధిలో నిత్యం పట్టపగలే వీధి లైట్లు వెన్నెలను తలపిస్తున్నాయి. ఒక వైపు నిత్యం కరంటు కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరో వైపు లో ఓల్టేజ్ సమస్యలతో ఎలక్ట్రికల్ పరికరాలు పాడౌతున్నాయి. ఇలా నిత్యం విద్యుత్ సమస్యలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు దొరవారిసత్రం మండల పరిధిలోని బురద మడుగు, మినమలమూడి, పల్లంపాడు, తనయాలి, కల్లూరు, అక్కరపాక మొదలగు గ్రామాల్లో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతూ దర్శనమిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్య దోరణి వల్ల వీధిలైట్లు రాత్రి పగలు తేడా లేకుండా వెలగడంతో గ్రామాల్లో విద్యుత్ సార్టేజ్ సమస్యలతో పాటు వీధి లైట్లు త్వరగా పాడౌతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. దానికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల మండల పరిధిలోని గ్రామాలలో వీధిలైట్లు వెలగడం వల్ల అధిక విద్యుత్ వినియోగం జరిగి ప్రభుత్వ ఖజానాకు గండి పడడంతో ఆ భారం స్థానిక సామాన్య ప్రజలపై పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య వలన పదే పదే వీధి లైట్లు పాడవడంతో వాటిని మరమ్మత్తు చేయడంతో పంచాయితీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని తెలిపారు. అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల జరిగే నష్టానికి పరోక్షంగానూ, ప్రత్యేక్షంగాను సామాన్య ప్రజలు నష్టపోతున్నారని ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## విద్యాపరంగా జిల్లాకు మెరుగైన స్థానం

**- ఎస్టీయు నాయకులతో డిఇఓ వరలక్ష్మీ**

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



జిల్లాను విద్యాపరంగా మెరుగైన స్థానంలో నిలబెట్టడానికి ఉపాధ్యాయ సంఘాలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన వరలక్ష్మిని రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ ఆధ్వర్యంలో ఎస్టీయు నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిఇఓ వరలక్ష్మి ఎస్టీయు నాయకులతో మాట్లాడుతూ విద్యాశాఖలో అధికారులు, ఉపాధ్యాయులు, సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరు సమిష్టిగా, సమన్వయంతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. టెన్త్‌లో మెరుగైన, నాణ్యమైన ఫలితాలు సాధించడానికి ఇప్పటి నుండి ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు వున్నా తన దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీయు అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోడే మోహన్‌యాదవ్, ఎస్టీయు రాష్ట్ర నాయకులు శ్రీదేవి, మునెప్ప మొదలి, పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, నరేంద్ర, గుణశేఖర్, బాలాజీ, ఢిల్లీబాబు, లక్ష్మీపతి, సుబ్రమణ్యంపిళ్ళై, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ యంత్ర వాహనాలకు ఆయుధపూజ



చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:
విజయదశమి దుర్గాదేవి ఆశీస్సులకై ఏపిఎస్పీడిసిఎల్ చంద్రగిరి సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ యంత్రాలకు, వాహనాలకు ఆయుధపూజ నిర్వహించారు. ఇందులో భాగంగా సబ్ డివిజన్ రూరల్ కార్యాలయంలో, అర్బన్ కార్యాలయ ఆవరణలో వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో వేదికలను అలకరించి, దుర్గాదేవి అమ్మవారి చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, యంత్ర పరికరాలకు, వాహనాలకు ఆయుధపూజలు చేశారు. అనంతరం ఈఈ వాసు రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలునాటి నీరుపోశారు. ఆయుధపూజ నేపథ్యంలో అతిధులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ ఆయుధపూజకు టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సీనియర్ నాయకుడు మొక్కల కుమార్‌రాజారెడ్డి, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి, తొండవాడ గ్రామకమిటీ అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్ హాజరు కాగా ఈఈ వాసురెడ్డి, ఏడిఈ శేషాద్రి రెడ్డి, ఏఈ నాగరాజ, ఏఈ వెంకటరమణ అతిధులకు ఆతిధ్యమిచ్చారు.

### పుంగనూరు విద్యాచరిత్రలో

## సన్నుతిరామమూర్తి మైలురాయి




పుంగనూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త :
చరిత్రలో పులినాడు, పుంగైయ్యూర్, వలనారాయణచతుర్వేద మంగళంగా కీర్తించబడిన పరశురామక్షేత్రమని పిలువబడే పుంగనూరు విద్యా చరిత్రలో దాత, వైశ్యరత్న, దివంగత సన్నుతి రామమూర్తి అని పలువురు వక్కాణించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని శుభారాం డిగ్రీకళాశాల స్థల విరాళదాత, దివంగత సన్నుతి రామమూర్తి కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా బెంగళూరు నుంచి వచ్చిన రామమూర్తి జేష్ట్యకుమారుడు సన్నుతి వాసవీశ్రీనివాసమూర్తి తన తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించి పుంగనూరు బసవరాజ ఉన్నత పాఠశాల అందించిన విద్యతో తన తండ్రి బెంగళూరులో మహావ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారన్నారు. నేడు కీలపట్ల, పెనుకొండ, పుంగనూరులతో పాటూ అనేక ప్రాంతాలలో విద్యాసంబంధ సేవలు నిర్విఘ్నంగా సాగుతున్నాయన్నారు. తన తండ్రి ఆశయాలను నిరంతరం సాగిస్తూ తమ కుటుంబం ముందుకు వెడుతోందన్నారు. ట్రస్టు సభ్యులు గోవిందరాజులు, ఉమారాజులు, ప్రకాష్, సుధాప్రకాష్, జిఆర్‌ప్రసాద్, వాసవీప్రసాద్, మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు మాట్లాడుతూ, పుంగనూరు ప్రజలు పోరాటంతో డిగ్రీకళాశాల సాధించడం ఒక ఎత్తయితే, కళాశాలకు స్థలాన్ని విరాళంగా అందించి లక్షలాది మంది విద్యార్థుల జీవితానికి బంగారు బాటలు వేసిన దాత సన్నుతి రామమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల సభ్యులు, పూర్వవిద్యార్థులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ సంస్కృత వర్సిటీకి రాజభాష నాయక్ పురస్కారం



తిరుపతి విద్య, అక్టోబర్ 27, ప్రభాతవార్త
అండమాన్ నికోబార్లోని పోర్ట్ బ్లేయర్లో జరిగినటువంటి 43వ అఖిల భారతీయ రాజభాష ప్రశిక్షణ శిబిరం మరియు సమ్మేళనంలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని రాజభాష సెల్ ద్వారా హిందీభాషా ప్రచార ప్రసారం మరియు వికాసం కొరకు చేస్తున్నటువంటి విశేష కృషికి విశ్వవిద్యాలయానికి రాజభాషా నాయక్ అనే పురస్కారాన్ని ఇవ్వడం జరిగింది. ఈ పురస్కారాన్ని జాతీయ సంస్కృత పోర్ట్ బ్లేయర్లో జరిగినటువంటి సమావేశంలో అందుకోవడం జరిగినది. విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి. ఎస్.ఆర్ కృష్ణమూర్తి హర్షాన్ని వ్యక్తం చేస్తూ, ఈ విధమైన విశేషకృషి చేస్తు న్నటువంటి రాజభాష సమితి సభ్యులైన ఆయన అభినందించడం జరిగింది.

## శివయ్య సేవలో అతిథులు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అతిథులు తాకిడి పెరిగింది. వచ్చిన అతిథులకు ప్రోటో కాల్‌మేరకు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. బాంబే హైకోర్టు జడ్జి ఎస్ మంగేష్ పటేల్ కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయం దర్శనం చేసుకున్నారు. కాగారిటైర్డ్ ఐఏయస్ పివి రమేష్ కుటుంబసభ్యులతో హాజరుకాగా దేవస్థానం ఎఇఓ సతీష్‌మాలిక్ స్వాగతం పలికారు. పిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్సెపెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడులు సేవలందించారు.

## డీఎస్పీ, సీఐలకు ఘన సత్కారం

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:




రేణిగుంట సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ శ్రీనివాసరావు, రేణిగుంట అర్బన్ సీఐ శరత్ చంద్రలను రేణిగుంటకు చెందిన లారీ సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. తొలుత ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ శ్రీనివాసరావు, అటు పిమ్మట అర్బన్ సీఐ శరత్‌చంద్రలను లారీ సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి రాయల్, రాము, హనీఫ్, రాజా రాయల్ తదితరులతో పాటు టీడీపీ మండల ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం వారికి వేరు వేరుగా పూలమాలలు వేసి బొకేలు సమర్పించి, శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

## నేడు జిల్లాకు ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ రాక

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అర్ స్టాంప్స్ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 28, 29వ తేదీల్లో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 28న సోమవారం మధ్యాహ్నం 1.05 గంటలకు మంత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని, అనంతరం తిరుపతి పట్టణంలో స్థానిక కార్యక్రమాలలో పాల్గొని రాత్రి బస చేయనున్నారని, మరుసటి దినం 29 అక్టోబర్ మంగళవారం ఉదయం తిరుమల వారిని దర్శించుకుంటారని, అనంతరం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని కలెక్టర్ తెలిపారు.

## డిజిపి కుమార్తె.. అల్లుడిని ఆశీర్వదించిన ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్



కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త
రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు కుమార్తె గాయత్రి సోనాక్షి, అల్లుడు రుత్విక్ సాయి లను ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ఆశీర్వదించారు. హైదరాబాద్ నగరంలోని సిటాడెల్ కన్వెన్షన్ సెంటర్‌లో డిజిపి కుమార్తె వివాహ వేడుకలు జరిగాయి. డిజిపి ద్వారక తిరుమలరావు ఆహ్వానం మేరకు వివాహానికి హాజరైన వైస్ ఛైర్మన్ పిఎస్ ముని రత్నం నూతన వధూవరులను నిండుమనసుతో ఆశీర్వదించారు.

## ఎర్రమరెడ్డిపల్లిలో బాల్య వివాహం

### పంచాయతీలతో పరిష్కారం.. బాలికను చదువుకు ప్రోత్సాహం

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లోనూ, వాడల్లో నిరక్షరాస్యత బాల్యవివాహాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రమరెడ్డి పల్లిలో ఓ బాల్యవివాహం జరిగిందనే తెలుసుకున్న స్వచ్ఛంద సేవా సంస్థలు, పోలీసులు పరుగులు తీసారు. అయితే పంచాయతీలు జరిపి సమస్యను పరిష్కరించారు. బాలిక చదువుకు భంగం కాకుండా రెసిడెన్షియల్ కళాశాలలో వదలిపెట్టారు. బాలిక మైనర్ అయినందువల్ల పోలీసులు పరుగులు తీసారు. గూడూరు వెళ్ళారు. అక్కడ సాయిబాబా గుడిలో దండలు మార్చుకొని వివాహం చేసుకున్నట్లు సమాచారం. సిఐ రవి నాయక్ వారి సిబ్బందితో గూడూరుకు పరుగులు తీసారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలం ఎర్రమరెడ్డి పల్లికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన మైనర్ బాలిక 9వ తరగతి చదువుతుంది. అదే గ్రామానికి చెందిన 31 సంవత్సరాల యువకునితో వివాహం చేసుకున్నట్లు ఎఎన్ఎం, మహిళా పోలీసుల సమాచారంతో వెలుగు చూసింది. ఈ సంఘటన తెలుసుకున్న ప్రగతి సంస్థ ఎంసిఓ ప్రభాకర్ చొరవ చూపారు. ఇరువురి కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామ పెద్దలు రంగంలో దిగి పంచాయతీ జరిపారు. బాలికకు 18 సంవత్సరాలు జరిగే వరకు చదువుకు ఎలాంటి అవరోధం కల్గకుండా ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్చారు. చదువు పూర్తి అయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దలు రాతమూలకంగా ఇరు కుటుంబాల నుంచి తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రగతి సంస్థకు చెందిన రాజారెడ్డి, నారాయణ, ఎంసియస్ ప్రభాకర్, జయలక్ష్మి, శిరీష, సుభాష్, చంద్రబోస్, రామయ్య, మధుకుమార్, వెంకటరత్నం పాల్గొన్నారు.

# కార్తీక మాసం దీపాలకు ప్రత్యేక మండపం

## సాంస్కృతిక కార్యక్రమాలు.. నిత్య సమీక్షలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక మాసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా దీపాలు వెలిగించుకొనుటకు ప్రత్యేక షెడ్డును నిర్మించాలని ఆలయ కార్యనిర్వహాణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డికి సూచించారు. ఈ మేరకు ఆచరణ కార్యచరణను చేపట్టారు. ధార్మిక కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వటానికి దేవాదాయశాఖ ఆదేశాలతో తిరుపతి ఆర్‌జెసి, శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆజాద్ పరుగులు తీయిస్తున్నారు. కార్తీక మాసం 30 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళికను ఇఓ ఆలయ అర్చకులు, పౌరోహితులు, వేదపండితులతో చర్చించిన మీదట ఖరారు చేసారు. ఈ ఏడాది బిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురాల మధ్య రంగుల గోపురం పక్కనే దీపాలు వెలిగించుకొనుటకు పెద్దషెడ్డును నిర్మిస్తున్నారు. వచ్చిన భక్తులు అసంతృప్తి చెందకుండా ఏర్పాట్లు చేపట్టారు.

### కార్తీక మాసం కార్యక్రమాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీకమాసం నిర్వహించే కార్యక్రమాల జాబితాను దేవస్థానం ఖరారు చేసింది. నవంబర్ 1 కార్తీకమాసం ప్రారంభం రోజు కేదార గౌరీ వ్రతంతో పాటు సాయంత్రం ఆకాశ దీపం ఆవిష్కరణతో కార్యక్రమాలు శ్రీకారం చుడతారు. నవంబర్ 1 నుంచి30 వరకు కార్యక్రమాలను రూపకల్పన చేసారు. నవంబర్ 4న మొదటి సోమవారం అంబారి ఉత్సవం నిర్వహిస్తారు. 5న నాగుల చవితి, రుద్రపాదాల వద్ద ప్రత్యేక పూజలు ఏర్పాటు. 7న స్కందషష్టి, రాత్రి చెంగల్వరాయస్వామిని నెమలి వాహన సేవ 8న కార్తీక శుక్రవారం ఉదయం అంబారి ఉత్సవం, 11న సోమవారం రాత్రి అంబారి ఉత్సవం 15న రాత్రి స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవ 18న రాత్రి అంబారి ఉత్సవాన్ని నిర్వహించుటకు తీర్మానించారు. 20నుంచి 29 వరకు స్వామి అమ్మవార్లకు లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన 25న రాత్రి అం బారి ఉత్సవం, 30న అష్టోత్తర కలశాభిషేకం ఉచ్చికాలంలో స్వర్ణముఖినదిలో బిల్వం కుంకుమలు నిజమజ్జనం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 12న బాలదీపం(భరణిదీపం) 13న చొక్కాణి ఉత్సవం నిర్వహించుటకు తీర్మానించారు.



కార్తీక మాసం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు షెడ్డు

### దీపాల వెలిగింపుకు ప్రత్యేక ఏర్పాట్లు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా శివాలయంలో దీపాలు వెలిగించటం శ్రేష్టమనే నమ్మకం ఉంది. అయితే కొన్ని సంవత్సరాల క్రితం దీపాలను ఆలయం లోపల వెలిగించే వారు. కొంత కాలం కోటమండపం వద్ద పరిమితం చేసారు. తరువాత నాలుగు గోపురాల మధ్య వెలిగించుటకు గాను బిక్షాల గాలిగోపురం, రంగుల గోపురం మధ్య ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేసి ఇక్కడ అవకాశం కల్పించారు. ఈ మేరకు ఒక వేళ వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా దీపాలు వెలిగించుకొనుటకు ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేయాలని ఇఓ ఆజాద్ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఇంజనీరింగ్ శాఖ ఏర్పాట్లు చేస్తున్నారు.

### సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాటు:

ఈ ఏడాది కార్తీక మాసం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని అంతేకాక ప్రతి రోజూ భక్తులు వీక్షించే విధంగా ఏర్పాటు చేయాలని ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వెంటనే షెడ్ నిర్మించటం సాధ్యం కాదు కాబట్టి ప్రస్తుతం సామాన్యభక్తులు విశ్రాంతి తీసుకుంటున్న షెడ్ వద్దనే సాంస్కృతిక కార్యక్రమాల వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.